క్లుప్తంగా

పరామర్శ



వాసుదేవరెడ్డిని పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వేపంజేరి సర్పంచ్ వాసుదేవరెడ్డిని గురువారం డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి పరామర్శించారు. వేపంజేరి సర్పంచ్ వాసుదేవరెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. ఆయన వెంట సురేంద్రరెడ్డి, వేలుమురు గన్‌బాబు పాల్గొన్నారు.

పురుషోత్తంరెడ్డి సేవలు అభినందనీయం



పురుషోత్తంరెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు రూరల్: తడుకు సింగిల్ విండో సీఈఓ పురుషోత్తంరెడ్డి సేవలు అభినందనీయమని ప్రెసిడెంట్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం ఉద్యోగ విరమణ చేసిన పురుషోత్తంరెడ్డిని ఘనంగా సన్మానించారు. పరమేశ్వరమంగళం సింగిల్ విండో ప్రెసిడెంట్ జయపాల్, కో–ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, సూపర్‌వైజర్ బాబు, తడుకు సింగిల్ విండో డైరెక్టర్లు వీరాస్వామి, మునిరాజ, అసిస్టెంట్ సీఈఓ వేణు పాల్గొన్నారు.

స్పర్శలో తేడాలను గుర్తించాలి



స్పర్శపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: కౌమార దశలో బాల, బాలికల్లో వచ్చే మార్పులకు అనుగుణంగా వారికి స్పర్శపై అవగాహన కల్పించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. గురువారం పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం బాలికలకు, శనివారం బాలురకు రక్తహీనత నివారణకు ప్రతి గురువారం ఆరోగ్యసిబ్బంది వారికి ఐరన్ మాత్రలు మింగిస్తారన్నారు. అనంతరం స్పర్శలో తేడాలను బాల, బాలికలు గమనించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, సుశీల ఏఎన్‌ఎం గంగా గౌరి పాల్గొన్నారు.

దేశమ్మ హుండీ ఆదాయం రూ. 6.53 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

నగరి: దేశమ్మ హుండీ ఆదాయం రూ.6.53లక్షలు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. టీఆర్ కండ్రిగలోని దేశమ్మ ఆలయ 49 రోజుల హుండీ కానుకలను గురువారం లెక్కించారు. లెక్కింపులో రూ.6.53 లక్షల నగదు కానుకలుగా వచ్చాయన్నారు. కార్యక్రమంలో చిత్తూరు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో ఈఓ కే.రామచంద్రారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ధర్మకర్తలు షేడు, బాబు పాల్గొన్నారు.

డీడీలు సక్రమంగా కట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులకు డీలర్లు నిర్ణీత సమయంలో డీడీలు కట్టాలని తహసీల్దార్ బాబు తెలిపారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో మండల పరిధిలోని డీలర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ కార్డులకు పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులకు డీడీలు సక్రమంగా కట్టాల్సిన బాధ్యత మీపై ఉందని తెలిపారు. కొన్ని గ్రామాల్లో పప్పు, పంచదార ఇవ్వలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటివి జరగకుండా చూడాలన్నారు. నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని సంబంధిత వీఆర్‌ఓ క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. డీటీ ముద్దబాబు పాల్గొన్నారు.

ఈ–క్రాప్.. రైతులు సేఫ్

ఖరీఫ్ సాగు చేసే ప్రతి రైతు ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వం నుంచి పలు ప్రయోజనాలు అందుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పండించిన పంటలను దళారుల నుంచి కాపాడుకుని, ప్రభుత్వ కనీస మద్దతు ధర పొందాలంటే పంట నమోదు కీలకం. రైతు పొలాల వద్దకే వచ్చే వ్యవసాయాధికారుల వద్ద ఈ–క్రాప్ నమోదు సులభతరం. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఈ–క్రాప్ బుకింగ్ నమోదును రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- పుత్తూరు డివిజన్‌లో జోరుగా పంటల వివరాల నమోదు
- రైతులకు బహుళ ప్రయోజనాలు
- ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతింటే తక్షణం పరిహారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



ఆర్‌సీపురంలో ఈ–క్రాప్ నమోదును పర్యవేక్షిస్తున్న ఏడీఏ రమేష్‌రాజు



పుత్తూరు మండలం వేపగుంటలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ సెల్వం

పుత్తూరు రూరల్: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకోవడంపై శ్రద్ధ వహించడం శుభపరిణామం. పుత్తూరు డివిజన్ పరిధిలో ఉన్న పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, రామచంద్రాపురం మండలాలు ఉన్నాయి. డివిజన్‌లో వేరుశనగ, వరి, చెరకు ప్రధాన పంటలు. వీటితో పాటు సజ్జలు, నువ్వులు, ఉద్దులు తదితర పంటలు సాగవుతున్నాయి. డివిజన్ పరిధిలో అన్ని పంటల మొత్తం సాధారణ సాగు 6,281 ఎకరాలు. ఇందులో ఇప్పటివరకు 5,434 ఎకరాల పంట నమోదు కాబడింది. క్షేత్రస్థాయికి తరలివస్తున్న అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్ల ద్వారా రైతులు పంట నమోదు పూర్తి చేసుకోవాల్సి ఉంది. ఏసర్వే నంబర్‌లో ఏ రైతు, ఏ పంట, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారన్న విషయాలను నమోదు చేస్తున్నారు. పంట సాగు చేసిన రైతును పొలం వద్దే ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇలా పూర్తి వివరాలతో ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే రైతు భరోసా, పంట బీమా, మద్దతు ధర వంటి ప్రయోజనాలు అందుతాయి. ఎన్నో ప్రయోజనాలకు మూలమైన ఈ–క్రాప్ నమోదును ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈ–క్రాప్ నమోదు వివరాలు

మండలం	సాధారణ నమోదు సాగు (ఎకరాల్లో)	పూర్తయిన విస్తీర్ణం (ఎకరాల్లో)
పుత్తూరు	1,058	725
నారాయణవనం	1,250	1,229
వడమాలపేట	1,475	1,464
రామచంద్రాపురం	2,498	2,016
మొత్తం	6,281	5,434

ఈ–క్రాప్‌తో పలు ప్రయోజనాలు



ఈ–క్రాప్‌లో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా అన్నదాతలు ఎన్నో ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. ఖరీఫ్‌లో పంటలను సాగు చేస్తున్న రైతులకు ఈ–క్రాప్ తప్పనిసరి. దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వ మద్దతు ధర పొందాలంటే పంట నమోదు అయి ఉండాలి. ఉదాహరణకు జిలకర మసూరి పంటను దళారి అయితే ఒక క్వింటాల్ కేవలం రూ.1200 నుంచి రూ.1300 లోపే కొనుగోలు చేస్తాడు. అదే ఈ–క్రాప్ నమోదు చేసి ఉంటే ప్రభుత్వమే సివిల్ సప్లైస్ ద్వారా సుమారు రూ.2 వేల చొప్పున కొలుగోలు చేసేందుకు అవకాశం ఉంది. అలాగే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే ప్రభుత్వం తక్షణం పరిహారం అందిస్తుంది. – రమేష్‌రాజు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, పుత్తూరు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- అర్హులందరికీ పథకాలు అందాలి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



పాల్గొన్న అధికారులు

వెదురుకుప్పం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఉప ముఖ్యమంత్రి కె. నారాయణస్వామి అధికారులను ఆదేశించారు. గురువారం పుత్తూరులోని క్యాంపు కార్యాలయంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మంత్రి దృష్టికి వచ్చిన సమస్యలపై ఆరా తీశారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి పరిష్కార చర్యలపై శాఖల వారీగా సమీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేర్చాలని అందుకు అధికారులు కృషిచేయాలన్నారు. కులాల వారీగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో పాటు అర్హత ఉండి పథకాలు రాని వారిని ప్రత్యేకంగా గుర్తించాలన్నారు. గంగాధరనెల్లూరు మండలంలో 578 మంది వితంతువు పింఛన్లకుగాను 328 మందికి మాత్రమే మంజూరైనట్లు ఎంపీడీఓ చెప్పడంతో స్పందించిన మంత్రి షెర్ప్ సీఈఓ ఇంతియాజ్ మహ్మద్‌తో ఫోన్‌లో మాట్లాడి అర్హత ఉన్న వారందరికీ మంజూరుచేయాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో పక్కా గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. శ్రీరంగరాజపురం మండలంలోని కటికపల్లె, కొత్తపల్లెమిట్ట, ఎస్‌ఆర్‌పురం గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలాగే నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలన్నారు. తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాధ్యతగా పనిచేసి ప్రభుత్వ ఆశయాలను అనుసరించి ప్రజలకు సేవచేయాలని చెప్పారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం



మాట్లాడుతున్న ఎంపీపీ నాగరాణి

వెదురుకుప్పం: ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రతి ఒక్కరికీ అందాలన్న ఉద్దేశంతో తీసుకొచ్చిన జగనన్న సురక్ష ప్రజలకు ఓ వరమని ఎంపీపీ నాగరాణి అన్నారు. గురువారం వెదురుకుప్పంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలన్న ఉద్దేశంతోనే జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్షతో పాటు అనేక అవకాశాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు వెంకటేశ్ మాట్లాడుతూ ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులను నడపడం లేదని నల్లవెంగనపల్లె నుంచి పుత్తూరు వెళ్లాలంటే 5 ఆటోల్లో ప్రయాణం చేయాల్సి ఉందని మండిపడ్డారు. గత సమావేశంలో సభ్యులు తీసుకొచ్చిన సమస్యలను ఇంతవరకూ పరిష్కరించలేదన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ మాట్లాడుతూ రెండేళ్లుగా 8 పర్యాయాలు సమావేశాలు జరిగినా సభ్యులు చెప్పిన ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని చెప్పారు. వీఆర్‌ఓ, ఆర్‌ఐ సంతాలు లేకనే భూమలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ లోకనాథరెడ్డి ఆరోపించారు. అళ్లమడుగు సమీపంలో ప్రభుత్వ భూములు కబ్జా చేసుకుంటూ కొందరే ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ లబ్ధిపొందుతున్నారని ఆరోపించారు. అనంతరం వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలన్న సభ్యుల డిమాండ్‌తో ఎంపీపీ నాగరాణి ప్రభుత్వానికి తీర్మానం పంపనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ సుధాకరరావు, డీటీ కోమల, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షురాలు భారతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

శ్రీరంగరాజపురం: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని రాష్ట్ర మహిళ నాయకురాలు కృపాలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు రాఖీలు కట్టి, మిఠాయిలు పంచారు. నాయకులందరికీ ఆమె రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉడమలకుర్తి సర్పంచ్ చిట్టిమహేష్‌కు రాఖీ కట్టి, స్వీట్ తినిపించారు.

ఆవుల దొంగలు అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

శ్రీరంగరాజపురం: ఆవులను దొంగిలించిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ షేక్షవాలి అన్నారు. చిన్నతయ్యూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం ఇంటి ఆవరణలో ఈనెల 22న అర్ధరాత్రి రామగిరి గ్రామానికి చెందిన మునివేలు(31), పార్థసారథి(41) ఇద్దరు సుబ్రమణ్యం ఇంటి ఆవరణలోని పాడిఆవును వాహనంలో తీసుకెళ్లారు. సుబ్రమణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ టీవీ పుటేజ్ ద్వారా దర్యాప్తు చేసి నిందితులను రామగిరిలో పట్టుకున్నారు. ఆవును యజమాని సుబ్రమణ్యంకు అప్పగించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

అర్ధగిరిలో శ్రావణ పౌర్ణమి వేడుకలు



హోమ పూజలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. చందనాలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో స్వామికి సుదర్శన హోమం నిర్వహించారు. రాత్రి ప్రాకారోత్సవం ఘనంగా నిర్వహించారు.

డిగ్రీ కళాశాలలో సంస్కృత దినోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా ప్రపంచ సంస్కృత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సంస్కృత అధ్యాపకురాలు డాక్టర్ పద్మమాలిని మాట్లాడుతూ ప్రాచీన భారతీయ భాషపై అవగాహన, ప్రచారం, పునరుద్ధరణ కోసం ఈ వేడుకలను నిర్వహిస్తారన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

శానిటరీ కిట్ల పంపిణీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలోగురువారం రెడ్‌క్రాస్ సౌజన్యంతో శ్రీకాళహస్తి పురపాలక సంఘ పారిశుధ్య సిబ్బంది 200మందికి శానిటరీ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి డాక్టర్ వెంకట్రామన్, ప్రాజెక్ట్ డైరెక్టర్ కొండుగారి కృష్ణకుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షురాలు మ్యాగీక్లారా, కండ్రిగ ఉమ పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి

ఐరాల: మామిడి పంటల కోత అనంతరం చేపట్టే యాజమాన్య పద్ధతులపైనే దిగుబడి ఆధారపడి ఉంటుందని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వైఎస్ గేటు సమీపంలో ఉన్న కలెక్షన్ సెంటర్‌లో గురువారం మామిడిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మామిడి పంటలో సాగు ఖర్చులు తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. మామిడి పంట కోత అనంతరం 15 నుంచి 20 రోజుల పాటు చెట్టుకు విశ్రాంతి ఇవ్వాలన్నారు. అనంతరం తోటలో అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించి సూర్యరశ్మి నలుమూలలా పడేవిధంగా చూడాలన్నారు. మామిడి తోటను వాలుకు అడ్డంగా రెండు సార్లు దున్నితే సరిపోతుందని, ఎక్కువ సార్లు దున్నవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శ్రీరెడ్డిరామ్, ఉద్యాన అధికారి లక్ష్మీప్రసూన పాల్గొన్నారు.


అన్ని భాషలకు తల్లి సంస్కృతమే



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ : ప్రపంచంలోని అన్ని భాషలకు సంస్కృతం తల్లివంటిదని గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల సంస్కృత అధ్యాపకుడు కోటీశ్వరయ్య తెలిపారు. కళాశాలలో గురువారం సంస్కృత భాషాదినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణ పౌర్ణమి రోజున సంస్కృత భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ప్రపంచ భాషల్లో సంస్కృతం ప్రాచీనమైనదని, అతి మధురమైన భాష అని కొనియాడారు. వేదానికి ఓంకారం, మానవజన్మకు మాతృమూర్తి లాగానే భారతీయులకు సంస్కృతం అంతే ప్రధానమైనదన్నారు. పాశ్చాత్య దేశాలు ప్రస్తుతం సంస్కృతం వైపు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. భారతీయులందరూ సంస్కృత విద్యను అభ్యసించాలని కోరారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి బహుమతులు, పుస్తకాలు అందజేశారు.

ఘనంగా సంచార జాతుల విముక్తి దినోత్సవం



హాజరైన నేతలు

తిరుపతి కల్చరల్: అఖిల భారత సంచార జాతుల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో గురువారం యూత్ హాస్టల్‌లో అఖిల భారత 71వ సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలి రాష్ట్ర అధ్యక్షుడు అన్నారెడ్డి వెంకట్ మాట్లాడుతూ 1871లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం సంచార జాతులపై క్రిమినల్ యాక్ట్‌ను తీసుకువచ్చిందన్నారు. దాని నుంచి సంచారజాతులకు 1952 ఆగస్టు 31న విముక్తి లభించిందన్నారు. అణగారిన సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ట్రైబల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్ సాహోడ్, కార్యవర్గ సభ్యులు ఆర్.డోలాకృష్ణ, చిత్తరంజన్, జిల్లా నాయకులు పగడాల ప్రసాద్, గంగాధరం, పవన్ పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

తిరుపతి అర్బన్: మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేద్దామని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గొడపేరు చిట్టిబాబు తెలిపారు. ఆయన గురువారం తిరుపతిలోని సుభాష్‌నగర్‌లో ఉన్న తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మెహతాబ్ రాయ్ ఉత్తర్వుల మేరకు కమిషన్‌లో ఆరుగురికి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జేసీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా బి.బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా దేవరపల్లి వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శులుగా ఏ మునికృష్ణ, కే.దేవరాజులు, ఏ.మోహనరూప, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా డీఎం చంద్రకళను నియమించినట్లు తెలిపారు. వీరు ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జేసీ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జ్ బి.సర్వేందర్, మెహతాబ్ రాయ్, చిట్టిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన వైద్యం చేయిస్తా!



గాంధీరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి రోజా

- పార్టీ శ్రేణులకు మంత్రి ఆర్కే రోజా భరోసా



బాలాజీని పరామర్శిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: అనారోగ్యానికి గురైన పార్టీ నాయకులకు నేనున్నానంటూ పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ హేమలత తండ్రి గాంధీరెడ్డి ఇటీవల అనారోగ్యం బారిన పడ్డాడు. విషయం తెలుసుకున్న మంత్రి గురువారం సాయంత్రం తిమ్మాపురం గ్రామంలోని అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకుని అవసరమైతే మెరుగైన వైద్య సేవలందిస్తానని ధైర్యం చెప్పారు. అలాగే తడుకు గ్రామానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలాజీని పరామర్శించారు. బాలాజీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గాంధీరెడ్డి, బాలాజీ ఇద్దరికి మెరుగైన వైద్యసేవలకు తగిన ఏర్పాట్లు చేస్తానని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, వైస్ చైర్మన్ జయప్రకాష్, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, కౌన్సిలర్ హేమలత పాల్గొన్నారు.

7న ఎస్వీ గోసంరక్షణశాలలో గోకులాష్టమి

తిరుపతి రూరల్: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఈ నెల 7న గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. టీటీడీ హిందువుల ముఖ్యమైన పండుగల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. ఇందులో భాగంగా శ్రీకృష్ణ గోలోకాన్ని తలపించే విధంగా టీటీడీ శ్రీవేంకటేశ్వర గోశాలలో ఏర్పాట్లు చేయనుంది. ఈ ఏడాది సందర్శకులు గోశాలలో గోమాతలకు బెల్లం, బియ్యం స్వయంగా తినిపించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. గోకులాష్టమి సందర్భంగా ఎస్వీ గోసంరక్షణశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామికి అభిషేకం, వేణుగానం వేద పఠనం, దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజనలు, కోలాటాలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీవేణుగోపాలస్వామివారి సన్నిధిలో గోపూజ, హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం శ్రీ వేణుగోపాలస్వామివారి దర్శనం, ప్రసాదాలు పంపిణీ చేస్తారు. సాయంత్రం 6 గంటలకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ గానం నిర్వహించనున్నారు.

ప్రజావసరాలకే ప్రాధాన్యం

- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం



సమావేశంలో మాట్లాడుతున్న నీలమేఘం

నగరి: ప్రజావసరాలకే ప్రాధాన్యత ఇస్తూ మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్తున్నామని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. గురువారం నగరి మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. అనంతరం వివిధ అంశాలకు సంబంధించిన తీర్మానాలను ఆమోదించారు. విప్ దయానిధి మాట్లాడుతూ జగనన్న విద్యాకానుకను లాంఛనంగా ప్రారంభించడానికి నగరిలో ఏర్పాటు చేసిన సీఎం సభను విజయవంతం చేసినందుకు సహకారం అందించిన కౌన్సిల్‌కు మంత్రి తరపు ప్రతినిధిగా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మంత్రి ఆర్కే రోజా సహకారంతో మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లోనూ ప్రజావసరాలను పూర్తిచేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

నగరి: నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో గురువారం చైర్మన్ తిరుమల రెడ్డి, సీఈఓ తులసిపిళ్లై ఆధ్వర్యంలో ఖాతాదారులకు, రైతులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో తాడేపల్లిగూడెం సత్యకృష్ణ కళాబృందం వారిచే చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, నగరి బ్రాంచ్, పీఏసీఎస్‌లో ఇస్తున్న వివిధ రకాల లోన్లు, డిపాజిట్లు పాటల రూపంలో వివరించారు. సీఈఓ తులసీ పిళ్లై మాట్లాడుతూ దేశంలో 1,367 డీసీసీ బ్యాంకులు, లక్ష సొసైటీలను బలోపేతం చేయడానికి భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. బ్రాంచ్ మేనేజర్ సందీప్ మాట్లాడుతూ తమ బ్యాంకులో డిపాజిట్లు చేసేవారికి వాణిజ్య బ్యాంకుల కన్నా అధిక వడ్డీ రేట్లు ఇస్తామన్నారు. బ్యాంకు సూపర్‌వైజర్ కె.ఆనందన్, డైరెక్టర్ ఏపీ దామునాయుడు పాల్గొన్నారు.